సాక్షి కుమురం భీం

సోమవారం । 13 । మార్చి । 2023



'గురుకులం'లో ప్రవేశాలు

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023- 24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 8లో▸



అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడు

నార్నూర్ మండల కేంద్రంలో అన్నాబావు సాఠె విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదివారం ఆవిష్కరించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /21.2

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం అంతగా ఉండదు.

న్యూస్‌రీల్

జిల్లా అటవీశాఖ అధికారిగా నీరజ్‌కుమార్ టిబ్రేవాల్



డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా అటవీశాఖ అధికారిగా నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎల్లందు ఎఫ్‌డీవోగా పనిచేసిన ఆయన కుమురంభీం జిల్లా డీఎఫ్‌వోగా ఫిబ్రవరి 10న బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్‌వోలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కాగా ఇప్పటివరకు డీఎఫ్‌వోగా మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి అదనపు బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, రేంజ్ అధికారులు అప్పల కొండ, మజారుద్దీన్, దయాకర్, పూర్ణచందర్, రాంబాబు, సంతోష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'సీవోఈ' ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన సీవోఈ ప్రవేశ పరీక్ష(గిరిజన జూనియర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశం కోసం) ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాలల ప్రిన్సిపాళ్లు సురేశ్, రమ్యలక్ష్మి, దివ్యారాణి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 811 మంది విద్యార్థులకు 742 మంది హాజరయ్యారు. 69 మంది గైర్హాజరయ్యారు. పీటీజీ కళాశాలలో 360 మంది, గిరిజన బాలికల పాఠశాలలో 181 మంది, గిరిజన డిగ్రీ కళాశాలలో 201 మంది పరీక్ష రాసినట్లు వారు పేర్కొన్నారు.

బీట్ అధికారులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఎఫ్‌బీవోలు

కాగజ్‌నగర్‌రూరల్: ఇటీవల నూతనంగా రిక్రూట్ అయిన అన్‌ట్రైన్డ్ 20 మంది ఎఫ్‌బీవోలకు కాగజ్‌నగర్ పట్టణంలో డీఎఫ్‌వో కార్యాలయంలో ఆదివారం ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డ్రిల్, మార్చ్ ఫాస్ట్, క్రమశిక్షణ తదితర అంశాల గురించి వివరించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ సొసైటీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ రమాకాంత్ యాదవ్, అడిటర్ విజయ్‌కుమార్, సలహాదారులు సింగ్లు బీట్ అధికారులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, డెప్యూటీ ఆర్‌వో ఎంఎ ముసావీర్, సెక్షన్ ఆఫీసర్లు మోహన్‌రావు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



పనిప్రదేశంలో కూలీలను ఫొటో తీస్తున్న ఉపాధి సిబ్బంది (ఫైల్)

ఉపాధికి సాంకేతిక సమస్య

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త యాప్‌లో హాజరు నమోదులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాంకేతిక సమస్యలతో ఆన్‌లైన్ కూలీల హాజరు నమోదు సక్రమంగా కావడం లేదు. కొత్త యాప్ కారణంగా అనేక మంది కూలీలకు నగదు కూడా సకాలంలో ఖాతాల్లో జమ కావడం లేదు. రెండు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాంకేతిక సమస్యతో సిబ్బంది, కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

- క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకం
- సర్వర్ డౌన్ కావడంతో పలుచోట్ల నిలిచిన పనులు!
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన అధికారులు
- జిల్లాలో 2,74,271 మంది కూలీలు

కౌటాల(సిర్పూర్): గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 17 ఏళ్ల క్రితం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర ప్రభుత్వం మరింత పారదర్శకత కోసం పనుల నిర్వహణలో ఇటీవల పలు మార్పులు చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. రైతులు, కూలీలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచే ఈ పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం చేపట్టాల్సి ఉంటుంది. గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన పనులపై చర్చించి ఎన్ని పనిదినాలు అవసరమవుతాయో నిర్ణయిస్తారు.

1,29,170 జాబ్‌కార్డులు, 2,74,271 మంది కూలీలు

జిల్లాలో 1,29,170 జాబ్‌కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,74,271 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. రెండేళ్ల క్రితం కరోనా కారణంగా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో పట్టణాల్లోని పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఇతర కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. దీంతో ప్రజలంతా గ్రామాల బాట పట్టారు. పట్టణాల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పల్లెలకు వచ్చిన వారికి ఈ పథకం వరంలా మారింది. ప్రస్తుతం లాక్‌డౌన్ నిబంధనలు లేకపోయినా చాలామందికి గ్రామాల్లోనే ఉపాధి దొరుకుతోంది. ఇప్పటి వరకు 1.67 లక్షల మంది కూలీల ఆధార్ సీడింగ్ పూర్తికాగా, ఇందులో 1.56 లక్షల మందికి ఆథెంటికేషన్ విజయవంతమైందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి..

ఉపాధి హామీ పథకంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చినప్పటి నుంచి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో ఏజెన్సీ మండలాల్లో సిగ్నల్ సమస్య కారణంగా హాజరు నమోదులో సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. తాజాగా సర్వర్ పనిచేయకపోవడంతో శుక్ర, శని వారాల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పనులు చేసినా హాజరు పడలేదని కూలీలు పేర్కొంటున్నారు. ఇదే అంశంపై ఈజీఎస్ ఉన్నతాధికారులు అన్నిమండలాల ఏపీవోలతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. తిర్యాణి మండలంలో నెట్‌వర్క్ సమస్య ఉండడంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. దీంతో పాత పద్ధతిలో కూలీల హాజరు నమోదు చేయాలని అధికారులు సూచించినట్లు తెలిసింది. నెట్‌వర్క్ సమస్య లేని ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. కూలీల హాజరుకు సంబంధించి ఏపీవోల ద్వారా దరఖాస్తులు తీసుకుని కలెక్టర్ లాగిన్ ద్వారా కూలీల హాజరు నమోదు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. కూలీలు ఆందోళన చెందవద్దని సకాలంలో నగదు ఖాతాల్లో జమవుతుందని పేర్కొన్నారు.

సర్వర్ సమస్య

కొత్త సాఫ్ట్‌వేర్‌లో ప్రతీ జాబ్‌కార్డుకు కూలీల ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌ను అనుసంధానం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతిరోజూ పని ప్రదేశాల్లో ఉదయం, సాయంత్రం రెండు సార్లు కూలీల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 10, 11వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధిహామీ యాప్‌లో సర్వర్ సమస్య ఏర్పడింది. పని ప్రదేశాల్లో తీసిన కూలీల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ కావడం లేదు. దీంతో జిల్లాలోని కూలీలు ఆందోళన చెందుతున్నారు. పని చేసిన పనికి కూలి రాకపోతే తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. వేసవిలో ఉపాధి పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి

- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- డీఐఈవో శ్రీధర్ సుమన్



ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ అన్నారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 9,933 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. 'నిమిషం నిబంధన' అమలులో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు హాల్‌టికెట్ల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్షిక ఫలితాల్లో జిల్లాను ఉత్తమంగా నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

సాక్షి: జిల్లాలో ఎంత మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డీఐఈవో: ఇంటర్ ఫస్టియర్‌లో 5,135, సెకండియర్‌లో 4,696, ప్రైవేట్‌గా ఫీజు కట్టిన వారు 102 మంది మొత్తం 9,933 మంది పరీక్షలకు హాజరవుతారు. ఇందులో జనరల్ విద్యార్థులు 8,457 మంది, ఒకేషనల్ 1,476 మంది ఉన్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆరు ప్రైవేట్ కళాశాలల్లో కేంద్రాలు ఉండగా, మిగిలినవి ప్రభుత్వ కళాశాలల్లో ఏర్పాటు చేశాం.

సాక్షి: ఎండ తీవ్రత దృష్ట్యా ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?

డీఐఈవో: ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశాం. ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతాం. వేసవి నేపథ్యంలో వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు కూడా అందుబాటులో ఉంటారు.

సాక్షి: వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను ఏ మేరకు సన్నద్ధం చేశారు?

డీఐఈవో: గతేడాది వార్షిక ఫలితాల్లో కుమురం భీం జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు రాష్ట్రంలోనే ఉత్తమంగా నిలిచాయి. దీంతో అడ్మిషన్లు కూడా భారీగా పెరిగాయి. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేశాం. మానిటరింగ్ టీం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించాం. ఏబీసీ కేటగిరీలుగా విభజించి ప్రశ్నాపత్రాల నమూనాలపై అవగాహన కల్పించాం.

సాక్షి: గతంతో పోలిస్తే ప్రశ్నపత్రంలో ఏమైనా మార్పులు ఉన్నాయా?

డీఐఈవో: కోవిడ్ నేపథ్యంలో గతేడాది విద్యార్థుల సౌకర్యార్థం కోసం కేవలం 70 సిలబస్‌తోనే ప్రశ్నపత్రం రూపొందించారు. కరోనా తగ్గుముఖం పట్టడంతో బోర్డు నిబంధనల మేరకు వందశాతం సిలబస్ పూర్తిచేశాం. ప్రశ్నపత్రం కూడా వందశాతం సిలబస్‌తోనే ఉంటుంది.

సాక్షి: మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఐఈవో: ప్రతీ ఎగ్జామ్ సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. మాస్ కాపీయింగ్ జరగకుండా సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. డిపార్ట్‌మెంట్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లా పరీక్షల కమిటీ తదితర శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతాయి. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్‌తోపాటు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

డీఐఈవో: పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదు. అరగంట ముందే కేంద్రానికి చేరుకునేలా ప్లానింగ్ చేసుకోవాలి. నిర్ణీత సమయం కంటే 15 నిమిషాల ముందే ప్రశ్నపత్రం అందిస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులతో చర్చించి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తాం.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

- జాతీయ సంస్థాగత కార్యదర్శి అరవింద్ మీనన్
- జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న అరవింద్ మీనన్

ఆసిఫాబాద్: రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జాతీయ సంస్థాగత కార్యదర్శి అరవింద్ మీనన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిరుమల మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్, శక్తి కేంద్రాల సమ్మేళనాలు, ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కి బాత్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి జొర్రీగల శ్రీకాంత్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కోకన్వీనర్ కొలిప్యాక కిరణ్, కాసిపేట లింగయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, కొట్నాక విజయ్, సేర్ల మురళీధర్, చక్రపాణి, ఖాండ్రే విశాల్, చునార్కర్ గణపతి, ఈర్ల విశ్వేశ్వరరావు, కొండ్ర తిరుపతిగౌడ్, ముత్తు అశోక్, సునీల్ చౌదరి, బానోత్ వెంకట్ నాయక్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యనగారి భూమన్న, పదాధికారులు, నియోజకవర్గ కన్వీనర్లు, జిల్లా కోర్‌కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలకు రాయిసెంటర్ 'సుప్రీం'

- అన్ని సమస్యలకు అక్కడే పరిష్కారం
- ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావు



మాట్లాడుతున్న కనక లక్కేరావు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీ గ్రామాలకు రాయిసెంటర్ సుప్రీం కోర్టు లాంటిదని ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావు పేర్కొన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లోని కుమురంభీం మ్యూజియంలో రెండురోజులుగా ఆదిలాబాద్ రాయిసెంటర్ సార్‌మెడి జిల్లా కమిటీ సభ్యులకు ఇస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా లక్కేరావు మాట్లాడుతూ.. గతంలో మాదిరి గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు, ఇంటి, కుటుంబ సమస్యలు రాయిసెంటర్ల ఆధ్వర్యంలోనే పరిష్కారం కావాలని తెలిపారు. కాలగర్భంలో కలిసిపోతున్న గిరిజన చట్టాలు, హక్కులను కాపాడడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని, పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందేలా చూస్తూ.. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. భూములు ఇతరులకు కౌలుకు ఇవ్వకుండా దున్నుకోవాలని పిలుపునిచ్చారు. గూడేల్లో ప్రతీ కార్యక్రమం ఇక నుంచి రాయిసెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు, ఆర్సీ శివరామకృష్ణ, పీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు, నాయకులు తొడసం చందు, పెందోర్ గోపి, సిడాం అర్జు, మోతీరాం, దేవ్‌రావు, సోనేరావు, భగవాన్‌షా, తుకారాం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ కరుణాకర్



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌టౌన్: యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ కరుణాకర్ సూచించారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు పలు కాలనీల్లో తనిఖీలు చేపట్టారు. పలువురుని అదుపులోకి తీసుకుని ఏమైనా నేర చరిత్ర ఉందా అని తెలుసుకునేందుకు మొబైల్ ఫింగర్ ప్రింట్ చెక్ డివైజ్‌తో పరీక్షించారు. మద్యం తాగి బైక్‌లపై తిరుగుతున్న యువకులపై కేసు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇక నుంచి ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి పూట రోడ్లపై గుంపులుగా తిరిగితే అరెస్ట్ చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. యువత రాత్రి పది గంటలలోపే పనులు పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐలు నాగరాజు, సాదిఖ్ పాషా, ఎస్సైలు డి.చంద్రశేఖర్, దీకొండ రమేశ్, సనత్ కుమార్, జగదీష్, రాజ్యలక్ష్మి, సోనియా, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి పెరిక శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. జీపీ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని 'చలో కలెక్టరేట్' విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

అవస్థల 'వసతి'



తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని మరుగుదొడ్ల పరిస్థితి ఇది. తలుపులు సగం వరకు ఊడిపోయాయి. ఇక్కడ ఐదు నుంచి పదో తరగతి వరకు 250 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో మురుగునీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా డ్రెయినేజీలు లేవు. దోమలు, ఈగల ఉధృతి పెరిగి ఇటీవల 25 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రమైన వాతావరణంతోనే విద్యార్థులు జ్వరాల బారిన పడినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు.

జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల(పీటీజీ)లో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు మొత్తం 697 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరు పడుకునే గదుల్లో ఫ్యాన్లు బిగించలేదు. వేసవి నేపథ్యంలో ఉక్కపోతతో విద్యార్థులు అల్లాడుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. టాయిలెట్స్‌లోని నల్లాలకు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ట్యాంకుల నుంచి బకెట్లతో నీటిని తీసుకెళ్లాల్సిన దుస్థితి.



- జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో సౌకర్యాల లేమి
- పరీక్షలు సమీపిస్తున్నా లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటుపై దృష్టి సారించని వైనం
- మురుగునీటి నిల్వతో అనారోగ్యం బారిన పడుతున్న విద్యార్థులు
- ఇటీవల తిర్యాణి ఆశ్రమంలో 25 మందికి అస్వస్థత

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వేసవి వచ్చినా ఫ్యాన్లు బిగించకపోవడంతో ఉక్కపోతలో అవస్థలు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, విరిగిన కిటికీలు, వెలగని లైట్లతో పరీక్షల వేళ పడరాని పాట్లు పడుతున్నారు.

అన్నింటికీ ఒకే గది..

2017లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులాలను ఏర్పాటు చేసింది. అయితే పలుచోట్ల ఇప్పటివరకు పక్కా భవనాలు నిర్మించలేదు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఎదుట ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో 1 నుంచి పదో తరగతి వరకు 458 మంది చదువుకుంటున్నారు. పక్కా భవనం లేకపోవడంతో ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతోంది. అద్దె భవనంలో సరైన సౌకర్యాలు కల్పించలేదు. తరగతి గదుల్లో వసతి కల్పించారు. అక్కడే బ్యాగులు, దుప్పట్లు, బకెట్లు ఇతర వస్తువులు ఉంచుకుంటున్నారు. ఉదయం ప్రార్థన కూడా తరగతి గదిలోనే కొనసాగిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కనీసం ఆడుకునేందుకు క్రీడాస్థలం కూడా అందుబాటులో లేదు. కొంత మంది తల్లిదండ్రులు విద్యార్థులు పడుతున్న అవస్థలను గమనించి గత్యంతరం లేక తమ చిన్నారులను వేరే పాఠశాలలో చేర్పించారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో కేజీబీవీలు 15 ఉన్నాయి. మైనార్టీ గురుకులాలు 3, మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలు 4, సాంఘిక సంక్షేమ గురుకులాలు 5, గిరిజన గురుకులాలు 5, ఆశ్రమ పాఠశాలలు 44 ఉన్నాయి. ఆయా వసతి గృహాల్లో 35 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ఫుడ్‌పాయిజన్, అపరిశుభ్రత, కలుషితమైన నీరు కారణంగా అనేక మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడిన విషయం తెలిసిందే. పలువురు విద్యార్థులు కూడా ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఓ జిల్లా జడ్జి వసతి గృహాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


సమ్మక్క మృతదేహం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కోగిల సమ్మక్క(45) మహిళ శనివారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. సమ్మక్క ఇంటిలో టీవీ ఆన్ చేయడానికి ఇంటి ముందు కిటికి పక్కన గోడకు ఉన్న ప్లగ్ బాక్సుకు టీవీ ప్లగ్ పెడుతున్న క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్యతో పాటు కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాశ్ పేర్కొన్నారు.

ఖానాపూర్ నియోజకవర్గంపై దృష్టి సారించండి


భట్టి విక్రమార్కతో వినోద్‌నాయక్

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భట్టి విక్రమార్క సూచించినట్లు ఏఐసీసీ రీసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కన్వీనర్ వినోద్ నాయక్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో భట్టి విక్రమార్కను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అదే విధంగా భట్టి విక్రమార్క చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేస్తామని తెలిపినట్లు వివరించారు.

‘అడెల్లి’కి పోటెత్తిన భక్తులు


ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సారంగపూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

‘గురుకులం’లో ప్రవేశాలు


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

- ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 5వ తరగతిలో ప్రవేశాలు
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- ఆదిలాబాద్ రీజియన్‌లో 17 గురుకులాలు, 1,360 సీట్లు

మంచిర్యాలటౌన్: కేజీ టు పీజీ ఉచిత విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గత నెలలోనే ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి ఈ నెల 6వ తేదీ వరకు చివరి తేదీగా నిర్ణయించగా విద్యార్థుల సౌకర్యార్థం గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించారు. ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధనను విజయవంతంగా కొనసాగిస్తున్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలను పొందేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపిస్తున్నారు. గత నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది.

ఆదిలాబాద్ రీజియన్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు	: 17
5వ తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 80 సీట్ల చొప్పున	: 1,360

ఆదిలాబాద్ రీజియన్‌లో 17 పాఠశాలలు...

ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలున్నాయి. 5వ తరగతిలో 80 సీట్ల చొప్పున ప్రవేశాలను జరుపుతుండగా, మొత్తం 1,360 సీట్లు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజన వసతి, సకల సదుపాయాలు కల్పించనున్నారు. మొత్తం 80 సీట్లకు ఎస్సీలకు 60, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 2, ఎస్టీలకు 5, బీసీలకు 10, మైనారిటీలకు 2, ఓసీ/ఓబీసీలకు 1 సీటును కేటాయిస్తారు. ఆయా పాఠశాలల్లో ఒక్కోసారి ప్రవేశం పొందితే 10వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్ వసతితో పాటు, అన్ని రకాల వసతులను కల్పించడం, పుస్తకాలు, బట్టలు, కాస్మొటిక్ చార్జీలను అందిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ గర్ల్స్, బోథ్ గర్ల్స్, ఇచ్చోడలో బాయ్స్ గురుకులాలు ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్ బాయ్స్, సిర్పూర్(టి) బాయ్స్, సిర్పూర్(టి) గర్ల్స్, కాగజ్‌నగర్ గర్ల్స్, రెబ్బెన గర్ల్స్‌గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో లక్సెట్టిపేట్ గర్ల్స్, చెన్నూరు గర్ల్స్, జైపూర్ బాయ్స్, కోటపల్లి బాయ్స్, మంచిర్యాల బాయ్స్, మందమర్రి గర్ల్స్, బెల్లంపల్లి బాయ్స్(సీఈవో), బెల్లంపల్లి గర్ల్స్, కాసిపేట బాయ్స్ ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు

సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం www.tswreis.ac.in, http:tgcet.cgg.gov.in, http:tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లలో ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తుకు రూ.100 చెల్లించడంతో పాటు, ఒక ఫోన్ నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678, 040–24734899, 9121174434 లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఫోన్‌లో సంప్రదించవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు2022–23 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు, ప్రవేశపరీక్షను ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహిస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..

- సన్నబియ్యంతో సహా అన్ని పోషక విలువలు ఉన్న రుచికరమైన ఆహారం.
- పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు స్టేషనరీ (పెన్సిల్, రికార్డు పుస్తకాలు వంటివి) ఉచితం.
- మూడు జతల స్కూల్ యూనిఫాం, ట్రంకు బాక్సులు సరఫరా
- పీ.టి. డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూ, సాక్స్, నైట్ డ్రెస్, ప్లేట్, గ్లాస్, కటోర, స్పూన్, బెడ్‌షీట్, బ్లాంకెట్, పరుపులు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు సబ్బులు కొనేందుకు డబ్బుల పంపిణీ.
- నెలలో నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్‌తో భోజనం.
- వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ వరకు స్వీకరిస్తారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 17 గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు చేసుకునేందుకు అవకాశం ఉంది. – కొప్పుల స్వరూపారాణి, గురుకుల విద్యాలయాల ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు


గాయపడిన బాలుడు ప్రణీత్

నెన్నెల: మండలంలోని మైలారంలో ఆదివారం ముగ్గురిపై పిచ్చికుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. ఎస్సీవాడలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు వేల్పుల ప్రణీత్‌పై పిచ్చికుక్క దాడి చేయగా అతడిని కాపాడేందుకు వెళ్లిన లింగంపల్లి నీరజపై సైతం దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. వీరితో పాటు బాలవోనివాడలో పోల్క చరణ్‌పై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో వారిని నెన్నెల పీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. ఒకే రోజు ముగ్గురిపై దాడి చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జంకుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కొర్తే మోహన్ (ఫైల్)

బెజ్జూర్: బైక్‌పై నుంచి కిందపడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సోమిని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం... కొర్తే మోహన్ (20) అందుగులగూడ గ్రామంలోని ఓ శుభ కార్యానికి బైక్‌పై బయలుదేరాడు. ఆ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి గుంతలో పడ్డాడు. గుంతలోని బండరాళ్లు తలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడు నెలల బాలుడు, భార్య ఉన్నారు.

నిలిచిన సమావేశాలు

- పెండింగ్‌లో కార్మికుల సమస్యలు
- రెండేళ్లుగా ఊసేలేని స్ట్రక్చరల్, సేఫ్టీ ట్రైపార్టియేట్ మీటింగ్స్
- జేసీసీ కూడా అంతే
- పట్టించుకోని సంఘాలు.. కార్మికుల ఆగ్రహం

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికుల సమస్యలపై చర్చించి ఒప్పందాలు చేసుకునే స్ట్రక్చరల్, జేసీసీ, సేఫ్టీ ట్రైపార్టియేట్ వంటి ముఖ్యమైన సమావేశాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోక మరుగున పడుతున్నాయి. రెండేళ్లుగా ఈ సమావేశాలను యాజమాన్యం నిర్వహించకపోవడంతో కార్మికవర్గం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది.

3 నెలలకోసారి స్ట్రక్చరల్ సమావేశం..

ప్రతి మూడు నెలలకోసారి కంపెనీ సీఎండీ స్థాయిలో, 2 నెలలకోసారి డైరెక్టర్(పా) కార్పొరేట్ స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించాలి. ఇందులో గుర్తింపు సంఘం నాయకులు పాల్గొని కార్మికుల డిమాండ్లు, సమస్యలను యాజమాన్యం ముందు పెట్టి చర్చించి పరిష్కరించుకుంటారు. ఇక్కడ జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఆర్‌ఎల్సీ వద్ద రాతపూర్వక ఒప్పందం చేసుకొని దానికి అనుగుణంగా కంపెనీ అధికారిక ఉత్తర్వులు విడుదల చేస్తారు. ఈ స్ట్రక్చరల్ సమావేశం తర్వాత రెండోరోజు జాయింట్ కన్సల్టింగ్ కమిటీ(జేసీసీ) నిర్వహిస్తారు. దీనికి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా హాజరై కార్మికుల సమస్యలను యాజమాన్యం ఎదుట చర్చిస్తారు. ఇవేవి జరగడం లేదు. అయితే 2017 అక్టోబర్ 5న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. 2018 ఏప్రిల్ 18న అధికారికంగా గుర్తింపునిచ్చారు. అప్పటి నుంచి కేవలం నాలుగుసార్లు మాత్రమే కార్పొరేట్ స్థాయిలో సమావేశాలు జరిగాయి. గడిచిన రెండేళ్లుగా పూర్తిగా నిలిచిపోయాయి. ఏరియా స్థాయిలో స్ట్రక్చరల్ సమావేశాలను ప్రతి నెలకోసారి జీఎం ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉన్నా జరగడం లేదు.

ఎన్నికలయ్యే వరకు ఆగాల్సిందేనా..

యాజమాన్యం వైఖరి చూస్తే గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగే వరకు ఆగాల్సిందే. గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లు పూర్తయిందని, దీనికి మించి మరో రెండేళ్లవుతున్నా ఎన్నికలు నిర్వహించాలని ప్రధాన ప్రతిపక్ష సంఘాల నేతలు సీఎల్సీకి ఫిర్యాదు చేశారు. 2022 ఏప్రిల్ నుంచి అన్ని సంఘాలకు సమస్యలపై రిప్రజెంటేషన్ చేసే అవకాశం కల్పించింది. ఇప్పుడు అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తున్న నేపథ్యంలో మళ్లీ ఈ సమావేశాలు ఎన్నికలు జరిగిన తర్వాతే నిర్వహించే అవకాశాలున్నాయి.

సేఫ్టీ ట్రైపార్టియేట్ లేదు

గనుల్లో జరిగే ప్రమాదాలపై, చేపట్టే రక్షణ చర్యలపై ఆరు నెలలకోసారి జరగాల్సిన సేఫ్టీ ట్రైపార్టియేట్ సమావేశం నిర్వహించడం లేదు. ఇందులో యాజమాన్యం, డీజీఎంఎస్ విభాగం అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొంటారు. ఈ సమావేశాలను యాజమాన్యం నిర్వహించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గనుల్లో పెరుగుతున్న ప్రమాదాలు, చనిపోయిన కార్మికులకు నష్ట పరిహారం కోసం డిమాండ్లు, ఇతర సేఫ్టీ సమస్యలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్‌లోని కార్మికుల డిమాండ్లు

మారుపేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలి. కొత్త గనులు ఏర్పాటు చేయాలి. పెర్క్స్‌పై ఆదాయ పన్నును కంపెనీ చెల్లించాలని డిమాండ్‌పై చర్చించాలి. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి. సింగరేణిలో ప్రైవేటీకరణ, బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకోవాలి. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి. గనుల్లో సేఫ్టీ పెంచాలి. ప్రమాదాలు తగ్గించాలి.

సింగరేణి రిటైర్డ్ అధికారుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న రిటైర్డ్ అధికారులు

రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థలో 38 ఏళ్లు పని చేసి ఉద్యోగ విరమణ పొందిన సర్వే అధికారులు మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 మంది అధికారులు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. వారి అనుభవాలను పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉంటున్నవారితోపాటు తమిళనాడు, కేరళ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. రిటైర్డ్ అధికారి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో సమ్మేళనం జరిగింది.

మధురస్మృతులు.. మదిలో మెదిలిన వేళ

- 30ఏళ్ల తరువాత ఒకేచోట చిన్ననాటి మిత్రులు
- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

దండేపల్లి: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. అంటూ 30 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులంతా ఒకేచోట కలుసుకున్నారు. మధుర స్మృతులను నెమరేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తారతమ్యాలు లేని లేత వయస్సులో చదువుతూ స్నేహితులైన వారంతా పదో తరగతి పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం ఎటువారు అటు విడిపోయారు. 30ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకునే సరికి వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇదంతా దండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం చోటుచేసుకుంది. ఇదే పాఠశాలలో 1992–93లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో కలుసుకున్నారు. ఉన్నత చదువులు చదివి కొంత మంది ఉద్యోగాల్లో, మరికొంత మంది వ్యాపారాలు చేస్తూ జీవితంలో స్థిరపడ్డారు. వారంతా ఒకేచోట కలుసుకుని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.

సంతోషంగా ఉంది..



చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఇక్కడ పదో తరగతి అవగానే ఉన్నత చదువుల కోసం ఎటువాళ్లు అటువెళ్లిపోయాం. ఆ తరువాత పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడ్డాం. 30 ఏళ్ల తరువాత ఒకే చోట కలవడం చాల ఆనందంగా ఉంది. చాలా ఏళ్ల తరువాత కలుసుకోవడంతో గుర్తుపట్టుకోలేదు. – శ్రీదేవి, నెల్లూరు

మరిచిపోలేని రోజు..



ముప్పై ఏళ్ల తర్వాత స్నేహితులందరం కలుసుకోవడం మధురానుభూతినిచ్చింది. ఇది జీవితంలో వర్చిపోని రోజు. చిన్నప్పుడు చదువుకున్న స్నేహితులను, చదువు చెప్పిన గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. గెట్ టూ గెదర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇవ్వగానే వచ్చేశాను.
– హేమలత, హిందీపండిట్, ధర్మారం, కేజీబీవీ

స్నేహానికి ప్రాణం పోసినట్టు...



పదో తరగతి పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం అందరం విడిపోయాం. అప్పటి నుంచి మిత్రులను కలుసుకోలేకపోయాను. పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంతో చదువుకున్న పాఠశాలలోనే మిత్రులందరం కలుసుకోవడం చిన్ననాటి స్నేహానికి ప్రాణం పోసినట్టనిపించింది.
– రత్నయ్య, ట్రాన్స్‌కో ఏఈఈ, ఆదిలాబాద్

గుర్తుకొస్తున్నాయి..!

- 50ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


1970-71 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు

ఆసిఫాబాద్: ఆరు పదులు దాటిన వయస్సు అందరిదీ... వివిధ వృత్తుల్లో పని చేసి కుటుంబ బాధ్యతలు తీర్చుకుని జీవితంలో స్థిరపడ్డారు. వారంతా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1970–71 పదో తరగతి పూర్తి చేశారు. సుమారు 50ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థుల సమ్మేళనం ద్వారా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మిత్రులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ముందుగా లోకం విడిచి వెళ్లిన వారికి బోధించిన గురువులు, మిత్రులకు సంతాపం ప్రకటించారు. అప్పటి గురువులు పాండు రంగరావు, రామానుజంలను శాలువలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాచం మధుకర్, పిన్న అశోక్, ముక్త సురేశ్, పంచదార దీపక్‌రావు, తాటిపెల్లి అశోక్, రావుల ప్రేమ్‌సాగర్, మధుకర్, మారవిశ్వనాథం, సిద్దం నాగేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడు

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్లు జనార్దన్, కోవలక్ష్మి
- నార్నూర్‌లో అన్నాబావుసాఠె విగ్రహం ఆవిష్కరణ
- సొంత నిధులతో ఏర్పాటు చేయించిన సర్పంచ్ గజానంద్

నార్నూర్: సాహితీ రత్న డాక్టర్ అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలో సర్పంచ్ గజానంద్‌నాయక్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన అన్నాభావుసాఠె విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇలాంటి మహనీయుల చరిత్రలు తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని, ప్రతీ కుటుంబంలో పిల్లల చదువుకునేలా చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉంటేనే సమాజం, గ్రామం అభివృద్ధి చెందుతుందని వివరించారు. అనంతరం లంబాడా సంప్రదాయ దుస్తులతో జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మిని గిరిజన మహిళలు సన్మానించారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరిస్తాం...

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులకు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని దళిత నేతలు జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న దళితుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వివరించారు. సీఎం కేసీఆర్, సీఎస్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మతాంగ్ ఋషి సంస్థాన్ పీఠాధిపతి గజానంద్ మౌలి, ఎంపీపీ కనక మోతుబాయి, కుమురంభీం జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, ఎంపీటీసీ పరమేశ్వర్, అన్నాభావుసాఠె కమిటీ జిల్లా అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్, మండల అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి బర్కుంబే రాజు, దళిత నాయకులు భారత్ వాఘ్మారే, నర్సింగ్‌మోరే, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యునుస్ అక్బానీ ఉన్నారు.


అన్నాబావుసాఠె విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

తాండూర్: అనుమానాస్పదస్థితిలో రైలుకిందపడి వివాహిత మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... భీమిని మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన శ్రీలత(25)కు తాండూర్‌లోని బెస్తవాడకు చెందిన పెద్దబోయిన మహేందర్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. శ్రీలత ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త, కుటుంబీకులు బంధువుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం కానరాలేదు. సాయంత్రం మండల కేంద్రంలోని పాత గోదాంల సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శ్రీలత శవమై కనిపించడంతో స్థానికులు ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. శ్రీలత మృతితో తాండూర్‌లో విషాదం అలుముకుంది.